ప్రజాశక్తి
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024



దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి-పాడేరు: కేంద్ర ప్రభుత్వం స్పైసెస్ బోర్డ్ సహకారంతో గిరిజన రైతులకు మిరియాలు వలిచి, శుభ్రపరిచే యంత్రాలు పంపిణీ చేయడానికి గత నెల 31వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని గతంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రకటించిన విషయం విదితమే. పలువురు రైతుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తుల గడువును ఈ నెల ఐదవ తేదీ వరకు పెంచినట్లు కలెక్టర్ ఒక ప్రకటన లో తెలిపారు. మిరియాలు వలవడానికి, ఎండబెట్టిన తర్వాత శుభ్రం చేయడానికి ఉపయోగపడే యంత్రాలు 75శాతం రాయితీపై గిరిజన రైతులకు అందిస్తామని చెప్పారు. విద్యుత్తు, డీజిల్, పెట్రోల్ తో ఈ యంత్ర పరికరాలు వినియోగించుకోవచ్చున్నారు. ఆసక్తి కలిగిన గిరిజన రైతులు ఈనెల ఐదవ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రైతు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలను జత పరిచి ఐటిడిఏ కార్యాలయంలో స్పైసెస్ బోర్డ్ ఆఫీసు లేదా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు మొబైల్ నెంబర్:9381045818కు సంప్రదిం చాలని స్పష్టం చేశారు.

మెగా పేరుతో దగా..

- పూర్తిస్థాయిలో భర్తీ చేయని డిఎస్‌సి పోస్టులు
- తక్కువ పోస్టులతో సరిపెడుతున్న ప్రభుత్వం
- ఏటా అమలు కానీ జాబ్ క్యాలెండర్
- నిరాశలో నిరుద్యోగులు
- ఎన్నికల జిమ్మిక్కు అంటున్న ప్రజా సంఘాల నేతలు



ప్రజాశక్తి-పాడేరు టౌన్:

పాదయాత్రతో పాటు గత శాసనసభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ సిఎం జగన్ మోహన్ రెడ్డి పలుమార్లు హామీలు గుప్పించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ విడుదల చేస్తామని గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ఒక్క డీఎస్సీ విడుదల చేయలేదు.

టీచర్ పోస్టుల భర్తీని నాలుగున్నరేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిరుద్యోగ యువతకు వల వేసేందుకు తాజాగా మంత్రి మండలిలో మెగా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయించింది. కేవలం 6,100 టీచర్ పోస్టుల భర్తీకి నిర్ణయించడంతో వైసిపి ప్రభుత్వం దగాకు గురి చేసినట్లేనని నిరుద్యోగ యువత మండిపడుతోంది. నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకోవడానికి డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ మభ్యపెడుతోందని నిరుద్యోగులు వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6100 పోస్టులు మాత్రమే భర్తీ చేయాలని నిర్ణయించడం నిరుద్యోగుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు కుమ్మరించింది. ఉన్న ఖాళీలను 117 జిఒ ముసుగులో కుదించేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి తగ్గించారు. ప్రతిపక్షంలో ఉండగా 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని జగన్ ప్రకటనలు చేశారు. వైసిపి ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లో 18,520 ఖాళీలు ఉన్నట్లు తేల్చింది. కానీ 8,366 మాత్రమే అవసరమని ఇప్పుడు 6,100 టీచర్ పోస్టులకు కుదించింది. జగన్ హామీ ఇచ్చినట్లుగా మెగా డీఎస్సీ వేసి ఉంటే కొంతమేర న్యాయం జరిగేదని, కనీసం 10వేల పోస్టులైన ఇచ్చి ఉండాల్సిందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్రెంటిస్ విధానం..

కొత్తగా నియమితులయ్యే ఉపాధ్యాయులకు అప్రెంటిస్ విధానం అమలు చేయాలని నిర్ణయించారు. గతంలో ఈ విధానం ఉండేది. ఉద్యోగముల చేరిన మొదటి సంవత్సరం రూ.1200, రెండో సంవత్సరం రూ.1500 వేతనం ఇచ్చేవారు. మూడో సంవత్సరంలో అప్రెంటీస్ ముగుస్తుంది. అప్పటినుంచి రెగ్యులర్ వేతనం ఇచ్చేవారు. తరువాత ఈ విధానం రద్దు చేశారు. తాజాగా మళ్లీ అప్రెంటిస్ విధానం పునరుద్ధరించాలని నిర్ణయించారు. దీనిపై నిరుద్యోగులు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇది ఎన్నికల డిఎస్‌సి..



ఎన్నికల కోసమే డీఎస్సీ ఇచ్చినట్లు అందరికీ తెలిసి పోతోంది. ప్రతిపక్షంలో ఉండగా 23వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేసి ఈ పోస్టులను భర్తీ చేస్తామని ఇప్పుడు చేస్తున్నదేమిటి. వైసిపి ప్రభుత్వం ఎన్నికలను గట్టెక్కెందుకే హడావిడిగా డీఎస్సీ డ్రామా ప్రారంభించింది. బిఈడి, పండిట్, పీజీ కోర్సులు చేసిన ప్రయోజనం లేదు. ఉన్నత విద్యను అభ్యసించిన వృధా అనిపిస్తోంది.

జీవన్ కష్ణ
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ఎన్నికల ముందు నిరుద్యోగులను మోసం



ఎన్నికలకు రెండు నెలలు ముందు డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ వైసిపి ప్రభుత్వం సరికొత్త నాటకం, మోసానికి తెరదీసింది. నాలుగున్నరేళ్లుగా ఉపాధ్యాయుల భర్తీని పట్టించుకోకుండా ఎన్నికల ముందు హడావుడి చేయడమే. ఇప్పుడు నోటిఫికేషన్ ఇస్తే పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారు? పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారు? ఎన్నికల సమయానికి ఈ ప్రక్రియ పూర్తి చేయడం సాధ్యమేనా?

ప్రభుదాస్,
డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు

ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

ఆదివాసి గిరిజన సంఘం నేత అప్పలనరస

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులను నిరాశపరిచే దగా డీఎస్సీగా ఉందని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి. అప్పల నర్స విమర్శించారు. గురువారం పాడేరు గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను దగా చేసిందని, సుమారు 5 లక్షల మంది ఎదురు చూస్తుంటే కేవలం తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం తగదని అన్నారు. విద్యా హక్కు చట్టం కింద ఖాళీలైన టీచర్ పోస్టులను భర్తీ చేయకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. వైసిపి పార్టీ గత ఎన్నికల హామీలో ప్రతి ఏడాది జనవరిలో మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ఎన్నికల వాగ్దానం చేసి 5 ఏళ్లు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర క్యాబినేట్ 6,100 పోస్టుల డీఎస్సీ ప్రకటించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 40 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా కుదించి కేవలం 6100 పోస్టులు ప్రకటించారని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలు గడిచినా ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించలేదని, 2014 లో చివరి ప్రత్యేక డీఎస్సీ అప్పటి ప్రభుత్వం తీసిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చి ఐదు సంవత్సరాలు గడిచినా స్పెషల్ డీఎస్సీకు అతీగతీ లేకుండా చేసి ఆదివాసీ నిరుగ్యోగులకు అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్ర క్యాబినేట్ సమావేశంలో స్పెషల్ డీఎస్సీ ప్రకటించకుండా మరోసారి ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం చేసిందన్నారు జీఓ 3 రద్దు తర్వాత స్పెషల్ డీఎస్సీ లేకుండా పోయిందన్నారు. జీఓ 3 రిజర్వేషన్ చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.సుందరరావు పాల్గొన్నారు



నిరాశ కలిగించింది

ఐదేళ్ల నుంచి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నాం. ఎంతో కష్టపడి చదువుతున్నాం. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ వేస్తారని ఐదేళ్లుగా ఎదురు చూసాం. ఇన్ని సంవత్సరాల తర్వాత మంత్రి మండలిలో మెగా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయించి పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉండగా 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇప్పుడు 6,100 పోస్టులంటూ నిరుద్యోగులకు ప్రభుత్వం మోసం చేసింది. నాలాంటి ఎంతోమంది నిరుద్యోగులకు నిరాశ కలిగించింది.

బి.సత్యరావు,
గిరిజన నిరుద్యోగి, పాడేరు మండలం

ఎన్నికలవేళ గుర్తొచ్చామా?

జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే ఉద్యోగాలు వస్తాయని భావించాం. 2019 నుంచి ఒక్క డీఎస్సీ విడుదల చేయలేదు. ఇన్నాళ్లు మెగా డీఎస్సీ అంటూ ఊరించిన వైసిపి ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే నామమాత్రపు డీఎస్సీ ప్రకటించింది. వ్యయ ప్రయాసాలకోర్చి గిరిజన ప్రాంతం నుండి మైదాన ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకున్నాం. జిల్లాకు చాలా తక్కువ ఖాళీలు ఉన్నాయని తెలిసింది. చాలా అసంతృప్తిగా ఉంది.

ఆర్.రవి,
గిరిజన నిరుద్యోగి,
పాడేరు మండలం



మాట్లాడుతున్న భాస్కరయ్య

చేతివృత్తిదారుల సంక్షేమం శూన్యం

- రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలి

- చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ భాస్కరయ్య

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

చేతి వృత్తిదారుల సంక్షేమ సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం విస్మరించిందని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య అన్నారు. సమస్యలు పరిష్కారానికై బీసీలు, చేతివృత్తిదారులు భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక శ్రీవిఘ్నేశ్వర తాపీ మేస్త్రి భవనంలో తాపీ మేస్త్రిల సంఘం మండల అధ్యక్షులు ఎస్ వీరబాబు అధ్యక్షతన జరిగిన చేతివృత్తిదారుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వివిధ రకాల చేతివృత్తులపై ఆధారపడి సుమారు కోటి 70 లక్షల మంది జీవనం సాగిస్తున్నారని, ప్రపంచీకరణ పుణ్యమా అని ఈ వృత్తుల్లోకి కార్పొరేట్ సంస్థలు ప్రవేశించి చేతివృత్తుదారుల పొట్టలు కొట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ వృత్తులు చేస్తున్న 139 కులాలు వారిని అభివృద్ధి చేస్తామని 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, రాజకీయ నిరుద్యోగ సమస్యను పరిష్కరించింది తప్ప, నిధుల కేటాయించకపోవడంతో చేతివృత్తుల వారికి ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయాయని విమర్శించారు. బీసీ సబ్ ప్లాన్‌కి రూ.38,206 కోట్లు కేటాయిస్తున్నామని చెప్పి వృత్తిదారులకు ఒక్క రూపాయి ఖర్చుపెట్ట లేదన్నారు. వృత్తిదారుల కో-ఆపరేటివ్ సొసైటీలను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ సబ్ ప్లాన్‌కు కేటాయించిన నిధులు చట్టబద్ధత కల్పించి వృత్తిదారులుగా ఉన్న బిసిల అభివృద్ధికి ఖర్చు చేయాలని కోరారు. 90శాతం సబ్సిడీతో రెండు లక్షల రూపాయలు రుణాలు కార్పొరేషన్ల ద్వారా ఇవ్వాలని, వృత్తిదారులకు అధునాతన యంత్రాలు అందజేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని, సమగ్రమైన కులగణన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం నాయకులు పాశం చలమయ్య, శ్రీఘేశ్వర తాపీ మేస్త్రి సంఘం నాయకులు అచ్చారావు, వీరబాబు, నాగు రామకృష్ణ, బుజ్జి, చేతివృత్తి సంఘాల మండల కార్యదర్శి తాటితూరి శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కె బాబూరావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు నక్క సత్తిబాబు, రజక సంఘం నాయకులు తురంగి కృష్ణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



సిఐ సన్యాసినాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఐలు, సిబ్బంది

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

సిఐ సన్యాసినాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని రాజవొమ్మంగి నూతన సీఐ ఎన్ సన్యాసినాయుడు అన్నారు. రాజవొమ్మంగి సీఐగా గురువారం సన్యాసినాయుడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అతన్ని రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు ఎస్ వెంకయ్య, రఘునాధరావు, అడిషనల్ ఎస్ఐ జాన్ కుమార్, ఎస్బి హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సన్యాసినాయుడు అల్లూరి జిల్లా పాడేరు దిశ పోలీస్ స్టేషన్ సిఐగా పనిచేస్తూ బదిలీపై రాజవొమ్మంగి సర్కిల్‌కి వచ్చారు. ఇప్పటి వరకు రాజవొమ్మంగి సీఐగా పని చేసిన స్వామినాయుడు విశాఖకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ, ప్రజలు, యువత, గంజాయి, నాటుసారా, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలని, బాగా చదువుకొని ఉద్యోగ అవకాశాలను అందుపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసిపి ఓటమి ఖాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

వైసిపి ప్రభుత్వ హయాంలో ఏజెన్సీలో గిరిజనులకు, బీసీలకు ఒరిగింది శూన్యమని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి పరాభవం తప్పదని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు అన్నారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధి గంగవరంలో గురువారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కృష్ణుడు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో బీసీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉంటున్న బీసీలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని కోరగా, టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తానే స్వయంగా ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి 10 సీట్లు కూడా రావని జోష్యం చెప్పారు. రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు గుర్తింపు లేకుండా పోయిందని, 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి ఒక్క రూపాయి కూడా నిధులను ఇవ్వలేదని ఆరోపించారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జేఎస్ నగేష్ మాట్లాడుతూ టిడిపి హయంలో బీసీలకు 34శాతం రిజర్వేషన్ ఉండగా వైసీపీ ప్రభుత్వం దానిని 24 శాతాన్ని కుదించిందని, దీనివల్ల బీసీలకు రావలసిన సుమారు 168 రాజ్యాంగ పరమైన పదవులు కోల్పోవడం జరిగిందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేత కృష్ణుడు



రిలే దీక్షలు చేపడుతున్న యుటిఎఫ్ నేతలు

ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని

యుటిఎఫ్ రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులోని ఐటీడీఏ కార్యాలయం ముందు యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం రిలే దీక్షలు చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు చీకటి నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ రిలే దీక్షలను ప్రారంభించారు. వివిధ మండలాల నుంచి యుటిఎఫ్ నాయకులు ఈ రిలే దీక్షలో పాల్గొన్నారు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలు డిఎ, ఎరియర్లు, సరెండర్ లీవులు, పిఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు, 12వ పి.అర్‌సి, 30 శాతం ఐ.ఆర్ చెల్లించాలని దీక్షా శిబిరంలో ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. ఈ రిలే దీక్షలలో పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వానికి ఎన్నో సార్లు ఉద్యోగుల సంఘాలు వినతులు, విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం కావడంతోనే రిలే దీక్షలు చేపట్టవలసి వచ్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల ఆర్థిక బకాయిలు చెల్లించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.దేముడు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కన్నయ్య, సీనియర్ నాయకులు వి.వి. ఈశ్వరరావు, బి.సింహాచలం, టి.విజయ్ కుమార్, ఎస్.బాలకృష్ణ, నారాయణ, . ప్రవీణ్, పి.లింగన్న, జె.పద్మనాభం, జి.దుక్కు, బంటు. శ్రావణ్, రాంబాబు, టి.మేఘనాథ్, తులసీదాసు పాల్గొన్నారు .



ప్రచారం చేపడుతున్న టిడిపి నేతలు

టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో టిడిపి విశాఖ రూరల్ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్ట గుల్లి సుబ్బారావు అధ్యక్షతలో సోలభం, గడుతురు, పెదలోచల పంచాయతీ గ్రామాల్లో గురువారం విస్తత ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించారు. గ్రామ ప్రజల్ని ఉద్దేశిస్తూ సుబ్బారావు మాట్లాడుతూ, బ జగన్ ప్రభుత్వం అరుకు పార్లమెంట్ కాన్స్టిట్యూయెషన్లో సుమారుగా 50వేల పెన్షన్లు తీసేయడం జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో వైయస్ఆర్సీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి వచ్చిన తర్వాత సర్పంచులకు, వార్డు మెంబర్లను కీలుబొమ్మలుగా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రెసిడెంట్ మత్స్యరాజు, సంస్కృతి విభాగం నాయకులు నాగబ్బాయి, సల్బం ప్రెసిడెంట్ కొండయ్యా నాయుడు, నాయకులు భీమశంకర్, టిఎన్ఎస్ఎఫ్ లీడర్ వినోద్, తెలుగు మహిళ నీలమ్మ పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల పరిహారం పరిహాసమేనా?

- సర్వేల పేరుతో సరిపెడుతున్న ప్రభుత్వం

- అందని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ



జల దీక్ష చేస్తున్న నిర్వాసితులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం పరిహాసంగా మారింది. ప్రభుత్వం సర్వేలతోనే కాలం వెళ్లబుచ్చుతోంది. ఆర్ అండ్ ఆర్ సర్వేల పేరుతో ప్రభుత్వం, అధికారులు గ్రామసభలు నిర్వహించినా నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందని పరిస్థితి నెలకొంది. పోలవరం సర్వేలు కొనసాగుతూనే ఉన్నాయి కానీ నిర్వాసితులకు మాత్రం న్యాయం జరగడం లేదు.

పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం నిర్వహించిన గ్రామ సభలకు ప్రతి ఒక్క ఇంటి యజమాని ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు, ఆధార్ కార్డులు, ఫొటోలు, ఇంటి ధ్రువీకరణ పత్రాలు తదితర వాటితో వచ్చారు. ఇందు కోసం వందల వేల రూపాయలు ఖర్చు పెట్టారు. పరిహారం వస్తుందేమోనని ఆశపడ్డారు. పునరావాస కాలనీల్లో గృహాలు ఇప్పిస్తారని ఎదురు చూశారు. పరిహారం, పునరావాసం ఏదీ రాలేదు. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఎకరాకు లక్ష 15 వేల రూపాయలు పరిహారం ఇచ్చిన వారికి తమ ప్రభుత్వం మరో రూ.3 లక్షల 85వేలు ఇచ్చి రూ.5 లక్షలు పరిహారం అందజేస్తామని జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ప్రకటించారు. మళ్లీ ఎన్నికలు మాత్రం సమీపిస్తున్నాయి కాని నేటికీ ఆ డబ్బులు నిర్వాసితుల ఖాతాల్లో వేయలేదు. దీంతో ఎంతో ఆశపడిన రైతాంగం నిరాశకు గురయ్యారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అవసరమైన రూ.20 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాలని గతంలో జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. కాని ఆ నిధులు రాబట్టడానికి ఆయన ఎటువంటి ప్రయత్నం చేయలేదు. నిధులు ఇవ్వాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇవ్వకుండా మోసం చేసినా ముఖ్యమంత్రి కనీసం ప్రశ్నించడం లేదు. మాట్లాడటం లేదు.

మరో వైపు వరదల కాలం దగ్గరొస్తుంది. ముంపు మండలాల ప్రజల పరిస్థితి ముందు గొయ్యి వెనక నుయ్యి మాదిరిగా మారింది. ఇప్పటికే కొందరు మండల కేంద్రంలోని వ్యాపారస్తులు తమ దుకాణాలను వేరొకరికి అమ్మేసి మకం మార్చేస్తున్నారు. ప్రస్తుతం శీతాకాలంలోనే శబరి, గోదారి నదుల్లో ఇసుక మేటలు మునిగి నిండుగా ప్రవహిస్తున్నాయి. ఈలోగా తుఫాను సంభవించి గట్టిగా రెండు రోజులు వర్షాలు పడితే మరల వరదలు వచ్చి ముంపు మండలాలు మునగటం ఖాయమని ప్రజలు భయపడుతున్నారు. 2022 సంవత్సరంలో సంభవించిన వరదలకు నష్టపోయిన ప్రజానీకం ఇంతవరకు తేరుకోలేదు. వరద నష్టపరిహారం ఇస్తామన్న ప్రభుత్వం కంటితుడుపు మాటలు చెప్పి తప్పించుకుంది.

ప్రజల బాధలు, నిర్వాసితుల అగచాట్లు పట్టించుకోని ముఖ్యమంత్రి నేడు ఆడుకుందాం ఆంధ్ర అంటూ తమ జీవితాలతో ఆటలాడుతున్నారని పోలవరం నిర్వాసితులు పెదవి విరుస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు పరిహారం, నిర్వాసిత ప్రజలకు పునరావాసం కల్పించే దాంట్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ముంపు మండలాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్వాసితుల పట్ల శ్రద్ధ వహించి పునరావాసం, పరిహారం వెంటనే విడుదల చేయాలని ముంపు మండలా నిర్వాసిత ప్రజానీకం ముక్తకంఠంతో కోరుతున్నారు.

పోలీసుశాఖ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- రంపచోడవరం

అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తూహీన్ సిన్హా ఆదేశాల మేరకు, రంపచోడవరం ఎఎస్పి జగదీష్ అడహళ్లి ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వారి సహకారంతో రంపచోడవరం పోలీస్ స్టేషన్లో మెగా రక్తదాన శిబిరం గురువారం నిర్వహించారు. రంపచోడవరం సబ్ డివిజన్లోని 10 పోలీస్ స్టేషన్‌ల నుంచి పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు తదితరులు 32 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరావు, ఎస్ఐ ఎం.మోహన్ కుమార్, అడిషనల్ ఎస్సై సత్య సాయి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పోలీసు సిబ్బంది



తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి

గోదాములో తనిఖీలు

ప్రజాశక్తి - పెదబయలు: స్థానిక జిసిసి గోదాములో గురువారం అల్లూరి జిల్లా సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరకుల సరఫరాలో ఎటువంటి పొరపాట్లు చోటుచేసుకున్నా సస్పెండ్ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజరు గాసి పాల్గొన్నారు

బడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం

- ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-పాడేరు: కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం చేసిందని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ధర్మన్న పడాల్, పి.బాలదేవ్ విమర్శించారు. ఇది కేవలం ఎన్నికల జిమ్మిక్కు బడ్జెట్ మాత్రమేనని ఆదివాసీ విద్య వైద్య నిరుద్యోగ సమస్య సంక్షేమం ప్రస్తావనలేదని అన్నారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బడ్జెట్ కేటాయింపుల్లో ఆదివాసీలకు తగ్గించి బడా కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ప్రకటించిందన్నారు. గిరిజన యూనివర్సిటీలు పూర్తి చేయుటకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం, నిధుల కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల విద్య వైద్య, ఆర్థిక సామాజికంగా అభివృద్ధికి కేటాయింపులు పెంచాలన్నారు.



డుంబ్రిగుడలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గురువారం కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. వైద్య అధికారిని మాట్లాడుతూ స్పర్శ లేని తెల్ల మచ్చలు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు అందించుకోవాలని ఆమె సూచించారు. దీంతోపాటు ఆవ్యాధి లక్షణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఓ సౌరి,హెల్త్ సూపర్వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్ స్వామి, ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదబయలు :మండలంలో సీకారి పంచాయతీ సచివాలయంలో రాష్ట్ర లెప్రసీ జాయింట్ డైరెక్టర్ దేవాసాగర్ పర్యటించారు. కుష్టు వ్యాధి నివారణ చర్యలను వివరించారు. అనుమానితులను క్షుణంగా పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నిఖిల్, ఎంపీహెచ్ఓ వెంకటరావు పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-పాడేరు: భవన నిర్మాణ రంగ కార్మికులు తమ సమస్యల్ని ఐక్యతతో పరిష్కరించుకోవాలని ఎలక్ట్రీషియన్స్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కొట్టగుళ్లి రామారావు పిలుపునిచ్చారు. గురువారం పాడేరులో నిర్మించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాపీ మేస్త్రి, ఎలక్ట్రికల్, ప్లంబర్, కార్పెంటర్, పుట్టి, పెయింటర్స్ సంఘం నిర్వహకులు కట్టుబడి ఐక్యంగా పనులు చేసుకోవడంతో అభివృద్ధి సాధించవచ్చునన్నారు. భవన నిర్మాణ సంక్షేమ సంఘానికి ప్రతి ఒక్కరు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్లంబర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎండి హనీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి దామోదరం, కోశాధికారి మట్టం స్వామి నాయుడు, విశ్వబ్రాహ్మణ అధ్యక్షులు కొమ్మోజు వెంకటరమణ, ఉపాధ్యక్షులు శ్రీశైలం నానాజీ, కార్యదర్శి సురేష్ మోదమాంబ తాపీ మేస్త్రీ సంఘం అధ్యక్షులు రాంబాబు, కే.కేశవరావు, పి తిరుపతిరావు, మోదమాంబ పెయింటర్స్ సంఘం అధ్యక్షులు బొంజు బాబు, ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భవన నిర్మాణ సంఘం నేతలు

సిపిఎం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు తదితరులు

ప్రజాశక్తి -అనంతగిరి

ప్రజల పక్షాన ఉంటూ నిరంతరం పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ సిపిఎంకు విరివిగా విరాళాలు ఇచ్చి సహకరించాలని జడ్పీటీసీ దీసరి గంగరాజు కోరారు. మండలంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోడు భూములకు పట్టాలు ఇవ్వ లేదన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లను అదాని, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాకర సింగులు, మామిడి కృష్ణ, ఆడారి సన్యాసి, ఆరికి రాంబాబు, కాకర భీమరాజు సియ్యాద్రి రాము కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపల్లి: సిపిఎం ప్రజా ప్రతినిధులు బలంగా ఉంటేనే చట్టసభల్లో ప్రజలకు మేలు జరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ ఆధ్వర్యంలో చింతపల్లి మండలం లంబసింగి తాజంగి పంచాయతీ కేంద్రంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, సిపిఎం ఎమ్మెల్యేలు, ఎంపీలు అసెంబ్లీ, పార్లమెంట్లో ఉంటే ఈ దేశ ప్రజలకు ఉపయోగం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, నాయకులు సాగిన చిరంజీవి పడాల్, మజ్జి రాంబాబు, సింహాచలం, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భారత్- ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్

ప్రజాశక్తి-పిఎం.పాలెం : భారత్ -ఇంగ్లాండ్ రెండో టెస్టు మ్యాచ్ శుక్రవారం డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ- వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. శుక్రవారం నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న టెస్టు మ్యాచ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో భారీ భద్రతా ఏర్పాట్లుచేసింది.

పార్కింగ్ ప్రాంతాలు

ప్రేక్షకులు తమ వాహనాలను కల్యాణ్‌కుమార్ పార్కింగ్ లేఅవుట్, 'బి' గ్రౌండ్‌లో ప్రత్యేకంగా పార్కింగ్‌కు ఏర్పాట్లుచేశారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు అవకాశం లేదు.

మ్యాచ్ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది. ప్రేక్షకులను ఉదయం 8 గంటల నుంచి స్టేడియంలోకి అనుమతిస్తారు.

ప్రాక్టీసుతో క్రికెటర్ల సందడి

పీఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ- వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో గురువారం భారత్, ఇంగ్లాండ్ జట్ల ఆటగాళ్లు ప్రాక్టీస్ చేశారు. ఉదయం భారత్ జట్టు క్రీడాకారులు, మధ్యాహ్నం ఇంగ్లాండ్ జట్టు క్రీడాకారులు ప్రాక్టీస్ చేశారు.



నెట్ ప్రాక్టీస్ చేస్తున్న భారత్ ఆటగాళ్లు

నేరాలు ఘోరాలు

కిడ్నాప్ కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -హుకుంపేట: బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని అరెస్టు చేశామని స్థానిక ఎస్సై బి.సతీష్ తెలిపారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు... హుకుంపేట మండలంలోని అడ్డుమండ పంచాయతీ సన్యాసంపాలెం గ్రామానికి చెందిన బాలిక గత నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాకపోవడంతో స్థానిక పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. గత నెల 29న మిస్సింగ్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. బాలిక వంతల హేమమాలిని ఇంటర్ మొదటి సంవత్సరం అరకు వ్యాలీలో చదువుతుంది. చీడికాడ పంచాయతీ చిడిపల్లి గ్రామానికి చెందిన యువకుడు సంతోష్ హేమమాలితో పరిచయం పెంచుకుని చోడవరం రమ్మని ఫోన్‌లో చెప్పాడు. ఆమె తన తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లింది. సంతోష్ తన గ్రామానికి తీసుకువెళ్లి అమ్మాయిని భయభ్రాంతులకు గురి చేయడంతో వెంటనే ఆ అమ్మాయి తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. దీంతో వెంటనే పోలీసులు ఫోన్ లొకేషన్ ద్వారా ట్రేస్ చేసి విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు. నిందితుడిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ సతీష్ మీడియా సమావేశంలో తెలిపారు.



నిందితునితో పోలీసులు

విద్యుత్ అంతరాయంతో అవస్థలు


ప్రజాశక్తి-పెదబయలు:మండలంలో అడుగులపుట్టు సచివాలయం పరిధి రైతు భరోసా కేంద్రంలో విద్యుత్ అంతరాయంతో పలు రకాల సేవలు స్తంభించి పోయాయి. సంబంధిత అధికారులకు సిబ్బంది చరవాణి ద్వారా తెలియపరచిన స్పందన లేదని రైతు భరోసా సిబ్బంది గురువారం తెలిపారు. రైతు భరోసా కేంద్రం వద్ద గంటల తరబడి వినియోగదారులు పడిగాపులు కాశారు. ఆధార్ కార్డులు అప్డేట్స్ సేవలను స్తంభించి పోయాయని పలువురు వాపోయారు.



వేచివున్న గిరిజనులు

మూగజీవాలకు టీకాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని కొర్ర పంచాయతీ కేంద్రంలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పంచాయతీ గ్రామంలోని 500 మూగజీవులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. వైద్యాధికారిని రాజశ్రీ మాట్లాడుతూ, మూగజీవులు కలిగిన ప్రతి ఒక్క గిరిజనులు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలని చెప్పారు. దీంతో మూగజీవులకు పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉండదన్నారు. వ్యాధులు ప్రబలితే తక్షణమే స్థానిక ఏహెచ్ఏలకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ ఎస్ సుబ్బారావు, ఏ హెచ్ ఏ ఏ జానకమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న సిబ్బంది

శాస్త్రీయ ఆలోచనలు, సాంకేతికత మార్పిడిలో

హిందీభాష ప్రాముఖ్యత ఎనలేనిది

ఎన్ఎస్‌టిఎల్‌లో సంయుక్త రాజ్యభాష సైంటిఫిక్, టెక్నికల్ సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కరాస/ఎంవిపి కాలనీ : దేశంలో సంక్లిష్టమైన శాస్త్రీయ ఆలోచనలు, సాంకేతికతలను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడంలో రాజ్యభాష హిందీ ఎంతో కీలకం, ప్రాముఖ్యమైనదని డిఫెన్స్ టెక్నాలజీ రంగ నిపుణుడు, డిఆర్‌డిఒ విశిష్ట శాస్త్రవేత్త, డిజి డాక్టర్ వై శ్రీనివాసరావు అన్నారు. డిఆర్‌డిఒ హైదరాబాద్ క్లస్టర్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఎస్‌టిఎల్‌లో రెండు రోజులపాటు నిర్వహించనున్న మూడో అఖిల భారత సంయుక్త రాజ్‌భాష సైంటిఫిక్ అండ్ టెక్నికల్ సెమినార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ, మాతృభూమికి సేవ చేయాలంటే శాస్త్రీయ సమాజానికి సేవ చేయాలన్నారు. దేశం మొత్తాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు హిందీభాష ఎంతో ముఖ్యమైనదన్నారు. హిందీ టెక్నికల్ సెమినార్ నిర్వహించిన ఎన్ఎస్‌టిఎల్‌ను అభినందించారు.

ఐఎస్ఎఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ పి.జె.నివారే మాట్లాడుతూ సరిహద్దులను సురక్షితం చేయడంలో డిఆర్‌డిఒ పాత్రను, సాంకేతికతలను ప్రశంసించారు. ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ భారతనౌకాదళం కోసం అత్యాధునిక ఆయుధాలను అభివృద్ధి చేయడంలో ఎన్ఎస్‌టిఎల్ పాత్రను వివరించారు.సెమినార్‌కు వచ్చిన ప్రతినిధులను ఆహ్వానించారు. సెమినార్‌లో డిఆర్‌డిఒ డైరెక్టర్ (రాజ్‌భాష) డాక్టర్ రవీంద్రసింగ్, ఎన్ఎస్‌టిఎల్ సైంటిస్ట్-జి, సెమినార్ ఛైర్మన్ సి.కేదార్‌నాథ్, సైంటిస్ట్-ఎఫ్ , సెమినార్ కోఆర్డినేటర్ వివేక్ శర్మ పాల్గొన్నారు.

కుట్ర రాజకీయాలకు 'గంటా' స్వస్తి చెప్పాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : కుట్ర రాజకీయాలకు ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వస్తి పలికి, వాస్తవాలు మాట్లాడాలని విశాఖ నవనిర్మాణ సమితి అధ్యక్షులు తోట రాజీవ్ హితవు పలికారు. గురువారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో విలేకరులతో మాట్లాడుతూ విశాఖ అభివృద్ధి జరుగుతుందని మూడు రాజధానులకు జై కొట్టిన గంటా, కపటప్రేమ నటిస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం రాజీనామా నాటకమాడాడన్నారు. టిక్కెట్ ఇచ్చిన పార్టీని అవమానపరుస్తూ, గెలిపించి ప్రజలను గాలికొదిలేసి, అండగా ఉన్న కేడర్‌ను అగౌరవ పరుస్తూ ఎపుడూ స్వార్థ రాజకీయాలే తప్ప, ప్రజాప్రయోజనాల కోసం ఎపుడూ పాటుపడలేదన్నారు. విడతకో నియోజకవర్గంలో పోటీచూస్తూ, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు ప్రస్తుతం ఉత్తర ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నాలుగున్నరేళ్లలో ఎన్నిసార్లు అసెంబ్లీకి వెళ్లారు, విశాఖ అభివృద్ధికి, నియోజకవర్గ ప్రజల కోసం ఏంమాట్లాడారో చెప్పాలన్నారు. గంటాపై సిట్ ఇచ్చిన నివేదికని బహిర్గతం చేసి, తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో నర్సింగ్ విద్యార్థులకు వృత్తిపరమైన అంశాలపై గురువారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. డాక్టర్ సి.రాకేష్ ఇన్‌స్ట్రక్టర్‌గా 13 నర్సింగ్ కళాశాలలకు చెందిన నర్సింగ్ విద్యార్థులకు బిసిఎల్ఎస్‌పై శిక్షణ ఇచ్చారు. ఈనెల12 వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ పివి సుధాకర్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీబా ఫ్రాన్సిస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి శివప్రసాద్ పాల్గొన్నారు

ఆయుర్వేద ఔషధ పరిశోధనల్లో సిసిఆర్ఎస్ కృషి

'గీతం' అంతర్జాతీయ సదస్సులో ఆయుష్ డైరక్టర్ డాక్టర్ బాబు

ప్రజాశక్తి -మధురవాడ :దేశంలోని ఔషధ పరిశోధనలు సామాన్య ప్రజలకు చేరువ కావడానికి కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చి ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సిసిఆర్ఎస్) విశేషకృషి చేస్తోందని సెంట్రల్ ఆయుర్వేదిక్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ జి.బాబు తెలిపారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యంలో 'ఆరోగ్య రక్షణ పరిశోధనలకు అవకాశాలు,సవాళ్లు' అనే అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో వినియోగంలోకి తెచ్చిన ఆయుష్- 64 ఔషధంతోపాటు ఆయష్-84, ఆయుష్-56, ఆయుష్ మానస్, తదితర ఔషధాలు దేశవ్యాప్తంగా మంచి ఫలితాలనివ్వడంతో ఆయుర్వేదంపై ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందన్నారు. కలకత్తాలోని ఆయుష్ అనుబంధ విభాగం ఔషధ పరిశోధనలతో పాటు 40 రకాల ఔషధాల తయారీపై దృష్టి సారించిందన్నారు.ఔషధ పరిశోధనలను ప్రోత్సహిచడానికి దేశంలోని ఐఐటిలు, సిఎస్ఐఆర్ ప్రయోగశాలలు, నైపర్ వంటి ప్రఖ్యాత సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీలో పరిశోధనలను అభినందించారు.

భారత ప్రభుత్వ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ ఎరామకిషన్ మాట్లాడుతూ భారత ఔషధ పరిశ్రమ 53 బిలియన్ల డాలర్ల వృద్ధి సాధించి, ప్రపంచంలోని ఔషధ ఉత్పత్తులకు కేంద్రంగా మారిందన్నారు. ఔషధ ఉత్పత్తులలో నూతన ఆవిష్కరణల వైపు దేశం అడుగులు వేస్తోందని, విద్యాలయాలలోని యువ పరిశోధకులు సహకారం ఉంటుందన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ కోవిడ్ సవాళ్లను అధిగమిస్తూ, దేశ ఆరోగ్యరంగం, వైద్య పరిశోధనలలో సైతం బలోపేతంగా మారుతోందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్ మాట్లాడుతూ ఔషధాల కోసం ప్రపంచదేశాలు ప్రస్తుతం భారత్ వైపు చూస్తున్నాయన్నారు. కోవిడ్ వ్యాక్సిన్లను స్వల్పకాలంలో అభివృద్ధి చేయడం ద్వారా భారతీయ ఔషధ పరిశోధనలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాజా, ప్రొఫెసర్ జి. శివకుమార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ పార్థరాయ్, కో-కన్వీనర్ డాక్టర్ పి.నరేష్ పాల్గొన్నారు.



సదస్సు సావనీరు ఆవిష్కరిస్తున్న ఆయుష్ అధికారులు

క్రికెటర్ కెఎస్.భరత్‌కు ఘనసత్కారం



భరత్‌ను సత్కరిస్తున్న సిపి, ఎసిఎ ప్రతినిధులు

ప్రజాశక్తి -పిఎం పాలెం: భారత్, ఇంగ్లండ్ రెండో టెస్ట్‌మ్యాచ్‌లో సొంతగడ్డపై తొలిమ్యాచ్ ఆడుతున్న క్రికెటర్ కోన శ్రీకర్ భరత్‌ను గురువారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఎసిఎ విడిసిఎ అంతర్జాతీయ స్టేడియంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అభినందన సభలో సిటీ పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ, విశాఖలోనే పుట్టి, పెరిగిన కెఎస్.భరత్, సొంతూరులో నిర్వహిస్తున్న క్రికెట్ టెస్టు మ్యాచ్‌లో భారత్ తరపున ఆడటం గర్వించదగ్గ విషయం అన్నారు. ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్. గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాటింగ్, వికెట్ కీపింగ్‌లో మంచి ప్రతిభ వల్లే భరత్ ఈ స్థాయికి చేరాడన్నారు. విశాఖ మ్యాచ్‌లో భరత్ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎసిఎ కోశాధికారి ఎవి.చలం, సిఇఒ డాక్టర్ ఎంవి.శివారెడ్డి, అపెక్స్ కౌన్సిల్ మెంబర్‌ఎన్.గీత, విడిసిఎ కార్యదర్శి కె.పార్థసారథి, సిఎఫ్ఒ ఎం.నవీన్ కుమార్, గేమ్ డెవలప్‌మెంట్, ఆపరేషన్స్ జనరల్ మేనేజర్లు ఎంఎస్.కుమార్, ఎస్ఎంఎన్.రోహిత్, కేఎస్ భరత్ కుటుంబసభ్యులు, కోచ్ కృష్ణారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి భరత్‌కు బుల్లయ్యకాలేజీ శుభాకాంక్షలు

సీతమ్మధార : నగరంలోని విసిఎ, పిడిసిఎ స్టేడియంలో శుక్రవారం నుంచి జరగనున్న భారత్ ఇంగ్లాండ్ క్రికెట్ మ్యాచ్‌లో కీపర్, బ్యాట్స్‌మెన్‌గా ఆడుతున్న డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పూర్వ విద్యార్థి, క్రికెటర్ కెఎస్.భరత్‌కు కాలేజీ కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. సొంతూరులో జరుగుతున్న మ్యాచ్‌లో విశేషంగా రాణించి, భారతజట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మధుకుమార్ మాట్లాడుతూ, స్వర్ణోత్సవం జరుపుకున్న బుల్లయ్యకాలేజీ ఎంతోమంది ప్రముఖ క్రీడాకారులను తయారు చేసి, వారి ప్రగతికి ప్రోత్సహించిందన్నారు.కెఎస్.భరత్ వంటి పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని నేటితరం కష్టపడి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి -గాజువాక: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, రాష్ట్రస్థాయి కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈనెల 16న సమ్మె చేపట్టనున్నట్లు భెల్ హెచ్‌పివిపి యూనిట్ సిఐటియు, ఐఎన్‌టియుసి నేతలు వెల్లడించారు. గురువారం సంస్థ హెచ్‌ఆర్ హెడ్ ఎంవిఎస్ఎన్ రాజుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా, స్థానిక సమస్యలు, దేశవ్యాప్త సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో వి బాబురావు, జిటిపి ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, సిహెచ్ఎస్‌వి.నారాయణ, జి,అచ్చెన్నాయుడు ఉన్నారు.

పర్యాటకాభివృద్ధి ముసుగులో దోపిడి

- వైసిపి సర్కార్, మంత్రి రోజాపై పీతల ఫైర్

ప్రజాశక్తి- సీతమ్మధార : రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని గొప్పలు చెప్పి, పర్యాటకం ముసుగులో దోపిడీకి వైసిపి సర్కార్ శ్రీకారం చుట్టిందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మండిపడ్డారు. గురువారం పౌరగ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రు ఎపి టూరిజం మంత్రి రోజా, ఎండీలందరూ అవినీతిలో కూరుకుపోయారని, రూ.వెయ్యికోట్ల ఆస్తిని ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. రుషికొండను బోడిగుండును చేశారని, ఇపుడు కైలాసగిరిని అసాంఘిక చర్యలకు వేదిక చేయాలని ప్రణాళికలు చేస్తున్నారన్నారు. వాటర్ స్పోర్ట్స్ పేరుతో తాటిపూడి రిజర్వాయర్‌ను కలుషితం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జివిఎంసి కౌన్సిల్ మీట్‌లో మేయర్ ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని చెరువులు, బీచ్‌లను సిఎం జగన్ బినామీలకు, విజయసాయిరెడ్డి కుటుంబీకులకు కట్టబెట్టి, పర్యావరణాన్ని నాశనం చేయాలని చూస్తున్నారన్నారు. వుడాపార్కులోని ఏడెకరాల పార్క్ భూములను ప్రయివేటు వ్యక్తులకు లీజ్‌కు కట్టబెట్టాలని ప్రణాళికలు చేస్తున్నారన్నారు. పర్యాటకప్రాంతం అరుకును రూ.150కోట్లకు పిపిపి పద్ధతిలో వైసిపి సర్కార్ టెండర్లంటూ హడావిడి చేస్తోందని ఆరోపించారు. దీనిపై జనసేన న్యాయపోరాటం చేస్తుందన్నారు.

బాబు వస్తే వైసిపి బాగోతం బట్టబయలు

ప్రజాశక్తి- ములగాడ : ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి నేతల బండారం, బాగోతం బట్టబయలు అవుతుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గురువారం జివిఎంసి 60వ వార్డు అశోక్‌నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన భూకుంభకోణాలు, అవినీతి, అక్రమాలన్నింటినీ వెలుగులోకి తెస్తామన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోని వచ్చిన సిఎం జగన్ రాష్ట్రాన్ని అథోగతి పాల్జేశారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తూ, రాష్ట్రాభివృద్ధిని ఇరవై ఏళ్లు వెనక్కు వెళ్లేలా చేశారన్నారు. మాటిచ్చి తప్పిన సిఎం జగన్‌కు, వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టిడిపి, జనసేన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో నాయకులు నక్క లక్ష్మణరావు, రాము, మాతా .శ్రీనివాసరావు, నీలాపు జోజి, జయశంకర్ పాల్గొన్నారు

సమస్యలపై భోజన కార్మికుల వినతి

ప్రజాశక్తి -గాజువాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. గురువారం ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మంగ, ఇతర నేతలు మాట్లాడుతూ, భోజన కార్మికుల వేతనాన్ని రూ.పది వేలకు పెంచాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు, వేతనాలతోపాటు ఇతర బిల్లులు చెల్లించాలని కోరారు. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలను ఒక్కొక్క విద్యార్థికి రూ.20 చొప్పు పెంచాలని కోరారు. ఎన్నికల ముందుకు తమకిచ్చిన హామీలను సిఎం జగన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నేతలువెంకటలక్ష్మి, రాధిక, ధన రవణమ్మ చిట్టెమ్మ పాల్గొన్నారు.

'అవంతి'లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి -తగరపువలస :స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాల, ఇసిఇ విభాగంలో రోబో కాప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యాన నిర్వహించిన రెండ్రోజుల వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. మైక్రో కంట్రోలర్, దాని నిర్మాణం, ప్రోగ్రామింగ్ మోడల్‌పై రోబో కాప్లర్ సంస్థ సిఇఒప్రవీణ్ మల్లా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంస్థ ఎంబెడెడ్ ఇంజనీర్ హరచంద్ర, హార్డ్‌వేర్‌పై కోడ్‌ను ఫ్లాషింగ్ చేయడం, ఎల్ఇడి, బజర్, డిసి మోటార్, పుష్ బటన్ స్విచ్‌లు వంటి మ్యాడ్యూల్స్‌ను ఇంటర్ ఫేస్ చేయడం, ఆర్డినోలో కోడింగ్ భావనల గురించి వివరించారు. వైఫై ఉపయోగించి రోబోను నియంత్రిస్తూ యాప్ డెవలప్‌మెంట్ డొమైన్‌లోకి అడుగు పెట్టవచ్చని వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఎ అర్జున్, వి.శివ భాస్కరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు